అధిక ఊగిసలాట



సమీక్ష : అమెరికాలో 'మరో మాంద్యం' తలెత్తవచ్చన్న ఆందోళనలు పెచ్చుమీరుతుండడం; ఐరోపా రుణ సంక్షోభం వెరసి దేశీయ మార్కెట్లను గత వారం కూలదోశాయి. జులై ద్రవ్యోల్బణం 9% పైన నమోదవడంతో ఆర్‌బీఐ కీలక రేట్లను పెంచుతుందన్న భయాలతో మార్కెట్లు బలహీనంగా ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత అమెరికా నిరుత్సాహ కర గణాంకాలు; అంతర్జాతీయ పరిస్థితుల కారణాలతో స్టాక్ మార్కెట్లలో భారీ విక్ర యాలు వెల్లువెత్తాయి. దీనికి తోడు ఐరోపా మార్కెట్ల బలహీనతలతో సెంటిమెంటు మరింత దెబ్బతింది. దీంతో సెన్సెక్స్ ఒక దశలో 16000 కీలక స్థాయి దిగువకూ వెళ్లింది. వారాంతానికి 698 పాయింట్ల భారీ నష్టంతో 16142 వద్ద స్థిరపడింది.

ఎఫ్‌ఐఐల పనితీరు బలహీన అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో విదేశీ సంస్థాగత మదుపుదార్లు(ఎఫ్‌ఐఐ లు) రూ.1022.20 కోట్ల నికర విక్రయాలు చేశారు. ఫండ్లు మాత్రం రూ.46.30 కోట్ల నికర కొనుగోళ్లు చేశాయి.

రంగాల వారీగా మరో మారు రిజర్వు బ్యాంకు రేట్ల పెంపు తప్పదన్న భయాల మధ్య వడ్డీ రేట్లతో ప్రభావితమయ్యే బ్యాంకింగ్, స్థిరాస్తి స్క్రిప్‌లు భారీగా నష్టపోయాయి. బలహీన అంత ర్జాతీయ అంచనాలతో ఐటీ షేర్లు నష్టాల పాలయ్యాయి. ఎఫ్‌ఎమ్‌సీజీ సూచీ రక్షణా త్మక రంగమైనప్పటికీ పెద్ద మార్పులేకుండా ముగిసింది. చమురు-సహజవాయువు రంగాలు నష్టాలతో ముగిశాయి. మిగతా రంగాలో పెద్దగా రాణించలేకపోయాయి.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 3:8గా నమోదవడం మార్కెట్లో బేరిష్ ధోరణి పెరిగిందనడాన్ని సూచిస్తోంది.

భవిష్యత్ అంచనా సెన్సెక్స్ 15988 కనిష్ఠ స్థాయిని తాకడం చూస్తే స్వల్ప/మధ్య కాలంలో మరింత బలహీ నతలు కనిపించవచ్చు. వచ్చే కొద్ది వారాలు/నెలల్లో సెన్సెక్స్ 14400-15000 శ్రేణి(మద్ద తుస్థాయిలు)కి పతనం అవ్వొచ్చు. కొద్ది నెలలుగా మార్కెట్ నష్టాల పాలవుతూ వస్తూ ఉండడం వల్ల ఒక వేళ 16433 స్థాయి కంటే పైకి వెళ్లగలిగితే మాత్రం బలహీనతలు కనిపించే ముందు 17200-17300 వరకూ రికవరీ కావచ్చు

ప్రభావిత అంశాలు అంతర్జాతీయ వార్తలు మార్కెట్ దిశను నిర్ణయించవచ్చు. మరీ ముఖ్యంగా యూఎస్, ఐరోపా మార్కెట్ల పరిణామాలను సునిశితంగా పరిశీలించొచ్చు. దేశీయంగా పార్ల మెంటరీ సమావేశాల్లో తీసుకునే ప్రభుత్వ విధాన నిర్ణయాలను కూడా మార్కెట్లు గమ నించొచ్చు. ఆగస్టు నెల డెరివేటివ్‌ల గడువు పూర్తికానుండడంతో ఊగిసలాట మరింత పెరగవచ్చు. ఇంకా ముడి చమురు ధరలు, ఆహార ద్రవ్యోల్బణం, ఎఫ్‌ఐఐల విక్రయా లు, యూఎస్ కొత్త గృహ విక్రయాలు, నిరుద్యోగ, జీడీపీ గణాంకాలు కూడా మార్కెట్ దిశను నిర్దేశించనున్నాయి.

తక్షణ మద్దతు స్థాయిలు: 15854, 15488, 15145; **తక్షణ నిరోధ స్థాయిలు:** 16433, 16709, 17000

ఈ వారంలో మార్కెట్ అధిక ఊగిసలాటకు లోనుకావచ్చు.

–సతీశ్ కంతేటి, జెన్‌మనీ